ప్రజాశక్తి
గురువారం 10 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం



తాగునీటి సమస్యలపై టోల్ ఫ్రీ
9490201062

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 9490201062ను ఏర్పాటుచేసినట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏదైనా గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఫోన్ చేసిన వెంటనే సంబంధిత గ్రామానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

పింఛన్లపై వాగ్యుద్ధం

- వెరిఫికేషన్ల పేరిట తొలగిస్తారేమో? : జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- 10లక్షల పింఛన్లను తొలగించింది వైసిపి ప్రభుత్వమే : మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఉపాధి బకాయిలపై నీళ్లు నమిలిన అధికార, ప్రతిపక్షాలు
- బిసి కార్పొరేషన్ల రుణాలకు ఎమ్మెల్యే లెటర్లు ఎందుకన్న సభ్యులు
- తాగునీటి అవసరాలకు ఉమ్మడి జిల్లాకు రూ.2కోట్లు కేటాయింపు
- ఎమ్‌పి, బొబ్బిలి ఎమ్మెల్యే మినహా హాజరుకాని ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పింఛన్ల మంజూరులో జాప్యంపై రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మధ్య వాగ్యుద్ధం చోటు చేసుకుంది. వాస్తవ పరిస్థితుల సంగతి కాస్త పక్కనబెడితే సుమారు 40నిమిషాలపాటు వీరి మధ్య వాగ్యుద్ధం కొనసాగింది. వైసిపికి చెందిన సభ్యులంతా చైర్మన్ మాటలకు మద్దతునివ్వగా, మంత్రి సమాధానం ఇస్తుండగానే సభ్యులు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదంటూ తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని అండగా నిలబడ్డారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా హామీలు నెరవేర్చలేదంటూ చైర్మన్ సహా వైసిపి సభ్యులంతా విమర్శించారు. ఐదేళ్లలో చేయలేని పనులు పది నెలల్లో చేసి చూపించామంటూ మంత్రి శ్రీనివాస్ సమాధానం చెప్పారు. చివరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జోక్యంతో వివాదం సద్దుమణిగింది. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్‌డిఎపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో జిల్లాలో పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో చేస్తున్న హడావుడి వల్ల చాలా మంది లబ్ధిదారులు తమకు పింఛన్లు పోతాయేమోనన్న ఆందోళనతో ఉన్నారని అన్నారు. తీవ్ర అనారోగ్యంతో మంచాలకు పరిమితమైన రోగులు, వికలాంగులు ఆసుపత్రులకు, కార్యాలయాలకు రాలేని పరిస్థితి ఉందని, ఇళ్ల వద్దే వెరిఫికేషన్ చేసేవిధంగా ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా? లేదా అన్నది సమాధానం చెప్పాలని జెడ్‌పి చైర్మన్ ప్రశ్నించారు. వింతంతువులకు గత ప్రభుత్వ హయాంలో వెంట వెంటనే పింఛన్లు మంజూరు చేసేవారని, ప్రస్తుతం ఇలా ఇవ్వడం లేదని పలువురు సభ్యులు విమర్శించారు. దీంతో, గత ప్రభుత్వమే రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల పింఛన్లను తొలగించిందని, తాము అర్హులందరికీ ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామని అన్నారు. దీంతో, సమావేశంలో వైసిపికి చెందిన మెజార్టీ సభ్యులు మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్క హామీ కూడా నెరవేరలేదంటూ బిగ్గరగా మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని, హామీలు కూడా ఒకొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. మంచం పట్టిన వారికీ, వికలాంగులకు పారదర్శకంగా వెరిఫై చేసి నిజమైన అర్హులకు అందజేయాలనే వెరిఫికేషన్ చేస్తున్నామన్నారు. మంచం పట్టిన వారి కోసం వైద్య బందం వారి ఇంటికే వెళ్లి వెరిఫై చేస్తున్నారని తెలిపారు. జీవిత భాగస్వామి మరణిస్తే వారి స్పౌజ్‌కు పింఛను నవంబర్ నుండి అందిస్తున్నామని తెలిపారు. నవంబర్ కన్నా ముందు చనిపోయిన వారికి కూడా పింఛను అందజేయడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

దీనికి ముందు తాగునీటిపై జరిగిన చర్చల్లో చైర్మన్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జెడ్‌పి నుంచి పార్వతీపురం, విజయనగరం జిల్లా కలెక్టర్లకు రూ.కోటి చొప్పున మొత్తం రూ.2కోట్లు కేటాయిస్తామన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ తాగు నీటి సరఫరా కోసం మెటీరియల్ అవసరమైతే ఎంపి నిధుల నుండి సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు (బేబీ నాయన) మాట్లాడుతూ బొబ్బిలి మున్సిపాలిటీకి తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ తాగునీరు, సాగునీరు సరఫరా చేయడానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ వేతన దారులకు వేతన బకాయిలు చెల్లించాలని సభ్యులు కోరిన మేరకు మంత్రి స్పందిస్తూ జనవరి 14 వరకు వేతనాలను చెల్లించడం జరిగిందని, ఈనెల 13, 14 తేదీలలో మిగిలిన బకాయిలు కూడా చెల్లిస్తామని తెలిపారు. సాక్షాత్తు జెడ్పీ చైర్మనే బకాయిల సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదు, కేంద్ర ప్రభుత్వం వద్ద ఆ సమస్య ఉందంటూ సర్దిచెప్పడంతో వైసిపి సభ్యులంతా మిన్నకుండిపోయారు. ఉపాధి పనులు పంచాయతీ తీర్మానాలతో జరగడం లేదని , పనుల నాణ్యత తక్కువగా ఉందని పలువురు సభ్యులు ప్రస్తావించగా జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందిస్తూ గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులనే చేపడుతున్నామని, నాణ్యత విషయంలో ఎక్కడైనా జరిగితే స్వయంగా తనిఖీ చేస్తానని కలెక్టర్ తెలిపారు. మండలానికి 40చొప్పున మాత్రమే బిసి కార్పొరేషన్ రుణాలు మంజూరయ్యాయని, దరఖాస్తులు వేలల్లో రావడం వల్ల అందరికీ న్యాయం చేయలేని పరిస్థితి ఉందని చెప్పారు. కార్పొరేషన్ రుణాల కోసం ఇప్పటి నుంచే ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు జారీ చేస్తున్నారని, ఆ లేఖలు ఉంటే తప్ప అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదంటూ దరఖాస్తుదారులు చెబుతున్నారని పలువురు సభ్యులు విమర్శించారు. అటువంటి పరిస్థితి లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్సీలు పివివి సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు), ఇందుకూరి రఘురాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు



రోడ్డుపై గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మహిళలు

పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన సిలిండర్లతో నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో మార్కెట్ యార్డు సమీపంలో రాయగడ రోడ్డుపై గ్యాస్ సిలిండర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు 9 సార్లు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచి, ప్రజలపై భారాలు మోపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు సగానికి సగం తగ్గినా మన దేశంలో కేంద్రంలోని మోడీ సర్కారు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లు ప్రజలకు ఉచితంగా ఇస్తామని ఒక పక్క చెబుతూనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుతుంటే కనీసం ప్రశ్నించకపోవడం విచారకరమన్నారు. దీని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ధరలు ఒక వైపు పెంచుతూనే ఆ భారం ప్రజలపై పడదని అబద్ధాలు చెప్పడం మరి ఆశ్చర్యంగా ఉందని ధ్వజమెత్తారు. తక్షణమే పెంచిన పెట్రోలియం ఉత్పత్తులు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రహానికి ఈ ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, నాయకులు బంకురు సూరిబాబు, పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, ఎం.గౌరమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

14న అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్‌లో మెయిన్ రోడ్డు వద్ద ఉన్న బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి దళిత నాయకులు, జిల్లా అధికారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత

కెజిబివిని సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి-సాలూరు

విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు మండలం కరసవలసలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కెజిబివి) మంత్రి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కెజిబివి నిర్వహణ, ఆహారం, విద్యా ప్రమాణాలపై ఫిర్యాదులు అందడంతో మంత్రి పాఠశాలను సందర్శించారు. ఆహార పదార్థాలు, పరిసరాల పరిశుభ్రత, బాలికల భద్రత, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. మంత్రి పిల్లలతో మమేకమై పాఠశాల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా నిర్వహించాలని కెజిబివి ప్రత్యేకాధికారిని ఆమె ఆదేశించారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ఏ విద్యార్థికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకూడదని, జరిగితే ప్రత్యేక అధికారి బాధ్యత వహిస్తారని తెలిపారు. విద్యా ప్రమాణాలు ప్రసిద్ధ సంస్థలకు తీసిపోని విధంగా ఉండాలన్నారు. విద్యార్థులు జాతీయ స్థాయి లేదా మరేదైనా పరీక్షల్లో పోటీపడే దశలో ఉండాలని స్పష్టం చేశారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏ విద్యార్థికీ రక్తహీనత ఉండకూడదని ఆమె ఉద్ఘాటించారు. ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని గమనించాలని, ఎలాంటి అనారోగ్యం వచ్చినా అప్రమత్తంగా ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పిల్లలతో కలిసి నేలపై కూర్చుని మంత్రి భోజనం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా నియోజకవర్గాల విజన్ ప్లాన్

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా శాసనసభ నియోజకవర్గాల వారీ విజన్ ప్లాన్‌ను రూపొందించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. విజన్ ప్లాన్ రూపకల్పనలో వృద్ధి వాస్తవానికి దగ్గరగా ఉండాలని, పక్కా ప్రణాళికతో సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. స్వర్ణాంధ్ర -2047 కెపాసిటీ బిల్డింగులపై విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు రెండు రోజుల వర్క్‌షాప్.. విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాకు సంబంధించి డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించామన్నారు. శాసనసభ నియోజకవర్గాల వారీ ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. ప్రణాళికల రూపకల్పనలో అన్ని నియోజకవర్గాలకు ఒకే ప్రణాళిక ఉండరాదని తెలిపారు. నియోజకవర్గాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొనే సమయంలో ఎమ్మెల్యేల సలహాలు, సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ ఏడాది 16.12 శాతం వృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని, తద్వారా తలసరి ఆదాయం రూ.1,94,048గా అంచనా వేస్తూ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ముఖ్యంగా జిల్లాలో 49.27 శాతం మేర ప్రాథమిక రంగం (వ్యవసాయ, అనుబంధ రంగాలు) నుంచే వృద్ధి ఉండబోతున్నట్లు తెలిపారు. 41.64 శాతం సేవా రంగాల నుంచి, 9.09 శాతం పారిశ్రామిక రంగం నుంచి వద్ధి ఉండనున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రాథమిక రంగంలో ఉద్యాన పంటల సాగును విస్తరించడం, పశు సంపదను వృద్ధి చేయడం తదితర చర్యల ద్వారా గణనీయంగా వృద్ధి ఉంటుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పండ్లు, కూరగాయల సాగుకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రణాళిక శాఖ విశ్రాంత డైరెక్టర్, సలహాదారు సీతాపతిరావు, మూడు జిల్లాల ముఖ్య ప్రణాళిక అధికారులు పి.బాలాజీ, పి.వీర్రాజు, వి.ఎస్.ఎస్.లక్ష్మిప్రసన్న, నియోజక వర్గాల ప్రత్యేకాధికారులు, పర్యవేక్షణ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సర్కారు పాపం.. పండుటాకులకు శాపం

పాలకులు మారుతున్నారు.. ప్రభుత్వాలూ మారుతున్నాయి.. చివరికి ఏ ప్రభుత్వం వచ్చినా పేదలకు చేసేది ఏమున్నదన్న చందంగా ఉంది పండుటాకుల పరిస్థితి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆరు ఫార్ములాల పరిశీలనలో భాగంగా అర్హులైనప్పటికీ కొంతమంది పింఛన్లు తొలగించారు. ఇప్పటివరకు స్ప్లిట్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో వారంతా పింఛన్లకు నోచుకోలేదు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలు గుప్పించింది. ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. అంతేకాక 60 ఏళ్లు నిండిన వృద్ధులు, భర్త చనిపోయిన వితంతువులు, వికలాంగులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా పింఛను ఊసే ఎత్తడం లేదు.



- అర్హులైనా సిక్స్ ఫార్ములాతో తొలగించిన వైనం
- ఏళ్ల తరబడి అందని పింఛన్లు
- జీవనం భారమవుతోందని ఆవేదన
- నూతన దరఖాస్తులకు మోక్షం కరువు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో 53 పంచాయతీలకు 31 సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుత వితంతువు, వృద్ధాప్య, వికలాంగ.. ఇలా అన్ని పింఛన్లు కలిపి సుమారు 8000 లబ్ధిదారులు ఉన్నారు. వికలాంగులు, కిడ్నీ, సికిల్‌సెల్ ఎనీమియా రోగులు, వృద్ధులు నూతన పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. సిక్స్ ఫార్ములాతో అర్హులైనప్పటికీ తొలగించిన వారూ ఉన్నారు. మండలంలో నూతన పింఛన్ల కోసం సీతంపేట సచివాలయంలో 27 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. తొలగించిన పింఛన్లు చూస్తే ఈ లెక్క ఇంకా పెరుగుతుంది. సీతంపేట మండలంలో కొత్తవి, తొలగించినవి, 50 ఏళ్లు నిండినవి అన్నీ చూస్తే 3వేల వరకు ఉంటాయి.

సిక్స్ ఫార్ములా పరిశీలనతో తొలగింపు

గత ప్రభుత్వ హయాంలో అర్హులైనప్పటికీ 6 ఫార్ములా పరిశీలనతో తొలగించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లపు భూమి మూడు ఎకరాలు ఉండకూడదు. సొంతంగా కారు, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి, పట్టణంలో 300 గజాల స్థలం ఉండకూడదు. ఇందుకోసం చేపట్టిన హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సర్వేలో తప్పుల తడకలు నమోదు కావడంతో అర్హులైన వృద్ధులకు పింఛన్లు తొలగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానిని మరల పునరుద్ధరణ చేయడానికి గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి కూటమి సర్కారు స్ప్లిట్ ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో పింఛన్ల కోసం పండుటాకులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కొంతమంది సచివాలయాలు, ఐటిడిఎ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా, పిజిఆర్‌ఎస్ (గ్రీవెన్స్)లో వినతులు సమర్పించినా ప్రయోజనం కనిపించక పోవడంతో విసిగి వేసారిపోయారు.

కొంతమందికి భూమిని సబ్ డివిజన్ చేసినప్పటికీ ఆన్‌లైన్‌లో విభజించినట్లు చూపలేదు. ఇంట్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఉండి తండ్రి కొడుకు వేర్వేరుగా ఉన్నప్పటికీ హౌస్ మ్యాపింగ్ ఒక దగ్గర ఉన్నట్టు చూపించారు. దీంతో అర్హులైన వారికి పింఛన్లు తొలగించారు. ఇలా చాలామంది పెంఛనుదారులకు స్ప్లిట్, యాడింగ్ ఆప్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. దానికి తోడుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. అర్హులైనప్పటికీ వివిధ కారణాల వల్ల తొలగించిన పింఛనుదారులకు యాడింగ్, డిలీట్ అవకాశం ఇస్తే కొత్త రేషన్ కార్డులు చేసుకోవాలి. దాని ద్వారా నూతన పింఛన్లు వచ్చే అవకాశం ఉంటుందని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛను కోసం ఎదురుచూస్తున్నా



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే పింఛను ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇంకా ఆ ఊసు ఎత్తడం లేదు. కొత్త పింఛను మంజూరు చేయాలి.

– డోల ఉపేంద్ర, సీతంపేట

అర్హులైనా తొలగించారు



నా చిన్న కుమారుడు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. కుమారుడు, నేను వేర్వేరుగా ఉంటున్నాం. నా రేషన్ కార్డులో కుమారుడు పేరు ఉండటంతో రెండున్నర ఏళ్లుగా నా వృద్ధాప్య పింఛను తొలగించారు. ఇప్పటికీ సచివాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించలేదు.

– డి.సూర్యనారాయణ, సీతంపేట


ఆప్షన్ ఇవ్వలేదు



కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వం ఇంకా ఆప్షన్ ఇవ్వలేదు. సచివాలయాలకు పింఛను కోసం దరఖాస్తులు వస్తున్నాయి.

– టి.కృష్ణారావు, ఎంపిడిఒ, సీతంపేట

వెంపలగూడ బ్రిడ్జి పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ


ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని వెంపలగూడ బ్రిడ్జి నిర్మాణాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బుధవారం పరిశీలించారు. రేగులగూడ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో సవర లక్ష్మణరావు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. బాధితులకు స్వయంగా కొంత ఆర్థిక సహాయం చేశారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించుటకు తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, టిడిపి మండల అధ్యక్షులు సవరతోట ముఖలింగం, ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సి పాఠశాల నిర్మాణ పనులను విజిలెన్స్ విభాగం ఎస్‌పి బర్ల ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమోదం పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్నాయా? లేదా తనిఖీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీరు, రాత్రిపూట లైటింగ్, కిటికీలకు గ్రిల్ లేకపోవడం, కాంపౌండ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పూర్తి పరీక్షలు చేసిన తరువాత ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డిఇ సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ మణిరాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్‌పి ప్రసాదరావు



ర్యాలీ చేపడుతున్న రైతుసంఘం నాయకులు, రైతులు

చిట్టిగెడ్డలో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

తాళ్లబురిడి గ్రామంలో సాగునీరు అందించే చిట్టిగెడ్డపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రైతులతో తాళ్లబురిడి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం సచివాలయ కార్యదర్శి జగదీష్‌కి వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాళ్లబురిడి సాయిగెడ్డపై అడ్డుకట్ట వేసి చిట్టిగెడ్డ ద్వారా లచ్చురాజుపేట, బందలుప్పి, పులుగుమ్మి గ్రామాల్లో సుమారు 300 ఎకరాలను రైతులు సాగుచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమి గుండా వెళ్తున్న ఈ గెడ్డను గ్రామానికి చెందిన విశ్రాంత విఆతో ఆక్రమించుకొని, బట్టిని కప్పేసి రైతుల పొట్ట కొట్టారని చెప్పారు. తరతరాలుగా రైతులు ఉపయోగించుకుంటున్న ఈ కాలువను కప్పేయడం చట్ట విరుద్ధమైన చర్యన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని, చిట్టిగెడ్డపై ఉన్న ఆక్రమణలన్నీ తొలగించి రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సాకిగెడ్డపై చెక్‌డ్యామ్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే జిల్లా కలెక్టర్‌తో పాటు జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు బంటు దాసు, తదితరులు పాల్గొన్నారు.



కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న సిపిఎం, గిరిజన సంఘం నాయకులు

రక్షణగోడలు నిర్మించాలి

ప్రజాశక్తి-పాచిపెంట

కోతకు గురైన రహదారుల వద్ద రక్షణగోడలు నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గిన్నిపల్లి రాజు, సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పాచిపెంట మండలం గుమ్మిడిగూడ నుంచి సీకుచింత గ్రామాల మధ్య రహదారిని బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా భారీ కోతకు గురైన రహదారులకు రక్షణ కల్పించాలన్నారు. మరలా వర్షం పడితే కొండవాగు నీరు తాకిడికి రోడ్లు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ రహదారి నీలంవలస సెంటర్ నుంచి గుమ్మిడిగూడ వరకు గిరిజనుల రాకపోకలకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. దీని ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని, రోడ్డు పాడవకుండా రక్షణగోడలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో పెదకాపు లక్ష్మి, ఎర్రజన్ని తమ్మయ్య, గిన్నిపల్లి ఎరకన్న దొర తదితరులు పాల్గొన్నారు.

యుబిఐ వితరణ

ప్రజాశక్తి-పార్వతీపురం

కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద లక్ష రూపాయలు విలువైన కలర్, బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్లు, స్కానర్లను యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా విరాళంగా అందించినట్లు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. బుధవారం ఐటిడిఎ కార్యాలయంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయ అధికారుల నుంచి ఆయన కంప్యూటర్ సామగ్రిని, ప్రింటర్లను స్వీకరించారు. వీటిని పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని వసతిగృహాలకు వినియోగిస్తామని పిఒ తెలిపారు. సిఎస్ఆర్ కింద సామగ్రిని యుబిఐ శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయ అధికారులు, బెలగాం యూనియన్ బ్యాంకు మేనేజర్ అందజేయడం పట్ల పిఒ హర్షం వ్యక్తం చేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం :

జియమ్మవలస మండలంలోని బిజె పురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థినులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురామరాజు తెలిపారు. డి.ఇంద్రాణి, గంట శ్రీవిద్య, కోట కోమలి చరిస్మా, డంగభద్ర కీర్తన, గంట యామిని ఎంపిక అయ్యారని చెప్పారు. ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లపాటు వీరికి స్కాలర్‌షిప్ లభిస్తుందని చెప్పారు.

వైసిపితోనే ఉంటాం

రాజన్నదొరను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-సాలూరు

తాము వైసిపిలోనే ఉంటామని, మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర నాయకత్వంలో పని చేస్తామని మండలంలోని పట్టుచెన్నూరు, పగులుచెన్నూరు, కొదమ గిరిశిఖర గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు స్పష్టంచేశారు. బుధవారం సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మాజీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, స్థానిక పెద్దలు.. రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా జీవనం సాగించామని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క పథకం కూడా అందలేదని చెప్పారు. ఏడాది కాలంగా చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలు చేస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూశామని, ఆశలు అడియాశలేనని అర్థమైందని చెప్పారు.

ఫారం పాండ్స్ పనులు పరిశీలన

సీతానగరం : మండలంలోని గాజులవలస గ్రామంలో చేపడుతున్న ఫారం పాండ్స్ పనులను, గోకులాల నిర్మాణాలను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్ పనులు వేగవంతం చేయాలన్నారు. గోకుల నిర్మాణ పనులు పూర్తి చేస్తే వారికి బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ఉపాధి పనుల వద్ద కూలీల మస్తర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు అదనపు సాయం

సాలూరు రూరల్ : మండలంలో పక్కా గృహాలు నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సహాయం అందజేస్తుందని హౌసింగ్ ఎఇ బొంగు అప్పలనాయుడు తెలిపారు. ఎస్‌సి, బిసిలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు చొప్పున, ఎస్‌టి గదబకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అదనపు సహాయంగా మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న గృహాలకు రూ.1.80 లక్షలు అందజేస్తుందని, దానికి అదనంగా ఈ సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. మండలంలో 744 మంది లబ్ధిదారులకు రూ.1.73 కోట్లు అదనపు సహాయంగా అందజేస్తుందని చెప్పారు. ప్రభుత్వం అదనపు సహాయం చేసిన గృహాలన్నింటినీ మే నెలాఖరికి పూర్తి చేయాలని కోరారు.

కొండచీపుర్లకు టెండర్లు

సీతంపేట : గిరిజనుల నుంచి జిసిసి సేకరించిన కొండచీపుర్లకు బుధవారం సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అడ్వాన్స్ టెండర్లను నిర్వహించారు. ఈ టెండర్లకు 10 మంది టెండరుదారులు హాజరయ్యారు. 63 టన్నుల లూజ్ చీపుర్లు (కట్టలు కట్టకుండా ఉన్నవి), 25 వేల చీపురు కట్టలకు టెండర్లను ఖరారు చేశారు. కార్యక్రమంలో జిసిసి డిఎం సంధ్యారాణి, మేనేజర్లు నరసింహులు, కృష్ణ, అకౌంటెంట్ రాము, చినబాబు, సూపరింటెండెంట్ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

పార్వతీపురంరూరల్ : మహాసంకల్పం కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతోపాటుగా చెత్త నుంచి సంపద సృష్టి కార్యక్రమంపై కళాజాతాల ద్వారా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం పార్వతీపురం మండలం డోకిసీల, గోచక్క, డికెపట్నం, బుదురువాడ, ఆడారు పంచాయతీలలో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణులకు అంటు రోగాల వ్యాప్తి, వ్యర్థ పదార్థాల నిర్వహణ, తడి, పొడి చెత్త కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగదీష్, కార్యదర్శి రాజగోపాల్, గ్రామ నాయకులు శ్రీధరపు రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

సాలూరు రూరల్ : సాలూరు పట్టణంలో పాత విద్యుత్తు సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా గురువారం సాలూరు పట్టణ, మండలంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ బి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాలూరు-మక్కువ బైపాస్ రోడ్డు మొదలుకొని, పెదకోమటిపేట, కోట వీధి, లావేటి వీధి, లవుడి వీధి, చిన్న బజార్, మెయిన్ రోడ్, జైపూర్ రోడ్, ఆర్‌టిసి కాంప్లెక్స్, వెంకటేశ్వర కాలనీ, సాలూరు మండలం పెదపారన్నవలస, చినపారన్నవలస, జీగిరాం, వ్యవసాయ పంపులున్న చంద్రప్ప వలస, పెదపదం, పెదబోరబంద, చినబోరబంద, వల్లాపురం, సన్యాసిరాజు పేట గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలు

గుమ్మలక్ష్మీపురం : ప్రణాళిక ప్రకారం పని చేస్తే రైతులు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ అన్నారు. జియ్యమ్మవలస మండలంలోని పరజపాడు గ్రామంలో సర్పంచ్ గుండ్రెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రైతులు సద్వినియోగం చేసుకొని, ఆర్థిక అభివృద్ధి చెందేటట్లు చేయాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ సూర్య తేజ, సభ్యులు జి.స్వామినాయుడు, బి.ధనుంజయరావు, త్రినాథ, సింహాచలం పాల్గొన్నారు.

పురంలో రాజకీయ జూదం



- చైర్మన్ కుర్చీ కోసం దోబూచులాట
- అవిశ్వాస నోటీసుపై నోరు మెదపని అధికారులు
- ఇంకా క్యాంపులోనే వైసిపి కౌన్సిలర్లు
- మేజిక్ ఫిగర్ కోసం టిడిపి ఎదురు చూపులు
- ప్రజా సమస్యలు పక్కదారి

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పురపాలక సంఘంలో రాజకీయ జూదం నడుస్తోంది. గత కొద్ది రోజులుగా మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య దోబూచులాట సాగుతోంది. పరిపాలన, పట్టణ ప్రజల సమస్యలను గాలికొదిలేసి ప్రధాన రాజకీయ పార్టీలు అవిశ్వాస రాజకీయాలకు తెరలేపాయి. ఓవైపు ఉన్న కౌన్సిలర్లను కాపాడుకునేందుకు వైసిపి క్యాంపు రాజకీయాలు చేస్తుంటే, మరోవైపు ఎలాగైనా వారిని అక్కున చేర్చుకోవాలని టిడిపి ఎదురుచూస్తోంది. అవిశ్వాస నోటీసుపై అధికారులు మాత్రం ఇంకా నోరు మెదపకపోవడం గమనార్హం.

ప్రజాశక్తి-పార్వతీపురం

కొద్ది రోజుల క్రితం టిడిపి కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసుని జాయింట్ కలెక్టర్ శోభికకు అందజేశారు. కౌన్సిల్‌లో బలం తక్కువగా ఉన్న టిడిపి ఫిరాయింపులను ప్రోత్సహించి వైసిపి చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేసింది. వైసిపికి చెందిన పదిమంది కౌన్సిలర్లు ఒకేసారి టిడిపిలో చేరడంతో చైర్‌పర్సన్ కుర్చీపై ఆశలు రేకెత్తాయి. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నాయకత్వంలో టిడిపి కౌన్సిలర్లు 18 మందితో గత నెల 24న అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. మొత్తం కౌన్సిలర్లలో టిడిపికి 18 మంది ఉంటే, వైసిపికి 12 మంది మిగిలారు. పదిమందితోపాటు మరో ఇద్దరు వైసిపి కౌన్సిలర్లను టిడిపిలోకి తీసుకుంటే అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేందుకు అవసరమైన మేజిక్ ఫిగర్ లభించేది. 18 మందితో అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేయడంతో ఆ నోటీసు చెల్లుబాటు కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో అధికారపార్టీ పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా మారింది. అవిశ్వాస తీర్మానం పెట్టి అభాసుపాలు కావాల్సిన పరిస్థితిని అధికారపార్టీ నాయకులు కొని తెచ్చుకున్నారు. అంతేకాకుండా టిడిపిలో చేరిన 10 మంది వైసిపి కౌన్సిలర్లలో ఇద్దరు తిరిగి సొంత గూటికి చేరడంతో అధికార పార్టీని మరింత ఇరకాటంలో పడేసింది. టిడిపి కౌన్సిలర్ల బలం 16కి పడిపోయింది.

ఎద్దు ఈనిందంటే దూడను శాలలో కట్టేయమన్న చందంగా టిడిపి నాయకుల పరిస్థితి తయారైంది. అవిశ్వాస తీర్మానం నోటీసు చెల్లుబాటు కావడానికి అవసరమైన నిబంధనల గురించి అవగాహన లేకుండా వ్యవహరించడం, గుడ్డిగా నోటీసుని జాయింట్ కలెక్టర్ శోభికకు అందజేయడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదన చేయడం వెనుక టిడిపి నాయకత్వం చిత్తశుద్ధిని శంకించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. నిజంగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించి చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే చిత్తశుద్ధి అధికారపార్టీ నాయకులకు ఉంటే 20 మంది కౌన్సిలర్లతో సంతకాలు చేసిన తర్వాతే ఆ నోటీసు అందజేసే వారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలా చేయకుండా ఉన్న 18మందిలో ఇద్దరిని జారవిడుచుకోవడం, మొత్తం కౌన్సిలర్లతో క్యాంపు నిర్వహించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నోరు మెదపని అధికారులు

టిడిపి కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నోటీసుపై జిల్లా అధికారులు గాని, మున్సిపల్ కమిషనర్ గాని నోరు మెదపడం లేదు. అవిశ్వాస నోటీసు సరైన ఫార్మాట్‌లో ఇవ్వలేదని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. అంతే కానీ 2/3 వంతు కౌన్సిలర్ల సంతకాలు లేనందున నోటీసు చెల్లుబాటు కాదనే విషయాన్ని జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్ చెప్పడం లేదు. అధికారపార్టీకి మేలు జరిగే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారపార్టీ కౌన్సిలర్ల బలం పెంచుకోవడానికి అవసరమైన సమయం చూస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఇప్పుడున్న కౌన్సిలర్లతోపాటు మరో నలుగురు వైసిపి కౌన్సిలర్లు దొరికితే పార్టీలో చేర్చుకుని మరోసారి నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేయడానికి అధికారులు మౌనవ్రతం పాటిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇంకా క్యాంపులోనే...

అవిశ్వాస తీర్మానం ఎదుర్కొంటున్న వైసిపి పాలకవర్గంలో 12 మంది కౌన్సిలర్లతో మాజీ ఎమ్మెల్యే జోగారావు శిబిరం నిర్వహిస్తున్నారు. ఇప్పుడు క్యాంపులో ఉన్న కౌన్సిలర్లను విడిచి పెడితే టిడిపి మరికొంత మందిని తన్నుకు పోతుందనే భయం ఆ పార్టీ నాయకులను వెంటాడుతోంది. మొదటిసారి ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసు కాకపోయినా మరోసారి నోటీసు ఇచ్చే అవకాశం ఉంటుంది. టిడిపి వద్ద ప్రస్తుతం 16 మంది మాత్రమే ఉన్నారు. మరో నలుగురు వైసిపి కౌన్సిలర్లు టిడిపికి అవసరం ఉంది. వైసిపి శిబిరం నిర్వహించకుండా కౌన్సిలర్లను వదిలేస్తే మరికొంత మందిని ప్రలోభపెట్టి తీసుకుపోయే అవకాశముంది. ప్రతిపక్ష పార్టీ హోదాలో కౌన్సిలర్లతో ఎక్కువ రోజులు క్యాంపు నిర్వహించడం కష్టమని భావిస్తున్న టిడిపి నాయకులు అవకాశం దొరికితే మరోసారి వైసిపి కౌన్సిలర్లను లాగేందుకు ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం టిడిపిదే కావడం, అధికారులు ఎలాగూ తమ కనుసన్నల్లో పని చేస్తారనే ధీమాతో అధికారపార్టీ నాయకులు రాజకీయ జూద క్రీడకు తెరలేపారు.

పాఠశాలలు మూసివేయొద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు • 'ఊరు బడిని రక్షించుకుందాం' వాల్‌పోస్టర్లు విడుదల



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

నూతన విద్యా విధానం పేరుతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం 'ఊరు బడి రక్షించుకుందాం' వాల్‌పోస్టర్లను సిపిఎం నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం వల్ల డ్రాప్ అవుట్స్ పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విజయవంతంగా నడుస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలలను మూసేసి తరగతులు, పాఠశాలలు విలీనం చేయడం వల్ల దూరం పెరిగి డ్రాప్ అవుట్స్ పెరుగుతాయని చెప్పారు. ఈ విధానం వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా బలహీనపడే ప్రమాదం ఉందని, ప్రజలకు అసౌకర్యంగా ఉండే పద్ధతులు మార్చుకొని ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలను సమాంతరంగా నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ దిశగా కేరళలో వామపక్ష ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వల్ల ప్రభుత్వ విద్యా రంగం బలపడిందని తెలిపారు. అదే విధానాలను మన రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా విధానంలో తీసుకొస్తున్న మార్పులను శాస్త్రీయబద్ధంగా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రూపకల్పన చేయాలన్నారు. లేకుంటే పాఠశాలలను కాపాడుకునేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం పరిచి ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, పట్టణ నాయకులు బి.సూరిబాబు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గిరిశిఖర గ్రామాల్లోని గిరిజనులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు తెలిపారు. గురువారం మండలంలోని నార్లవలస పంచాయతీ గిరిశిఖర గ్రామం మారయ్యపాడులో పర్యటించారు. స్థానిక గిరిజనులతో ఆయన మాట్లాడుతూ తాడిలోవ నుండి మారయ్యపాడు వరకు రహదారి, దాడిలోవ, చినమారయ్యపాడు గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. చిన్నమారయ్యపాడు గ్రామస్తులు చాలామంది పిల్లలకు ఆధార్ కార్డుల్లో సమస్యలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరము పెదపదం పంచాయతీ పాలికవలస గ్రామంలో పర్యటించారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న చాలామంది గిరిజనులకు పట్టాలు లేవని ఆయనకు విన్నవించారు. ఆయన అక్కడే ఉన్న తహశీల్దార్‌తో మాట్లాడుతూ వన్‌బిలు ఇప్పించేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, తహశీల్దార్ ఎన్‌వి రమణ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, నాయకులు మత్స విజయభాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ఫీల్డ్‌అసిస్టెంట్ల వినతి



గుమ్మలక్ష్మీపురం.. వినతి అందిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ సాల్మన్ రాజుకు గురువారం వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు మాట్లాడుతూ 19 ఏళ్లుగా ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికీ ఎఫ్‌టిఇ అమలు చేయాలని, ప్రమాదవశాత్తూ మరణించిన వారికి రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600కు పెంచాలని, మేట్లకు గౌరవ వేతనం, ఫోన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండంగి సన్యాసిరావు ఉన్నారు.

గరుగుబిల్లి : ఫీల్డ్‌అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేల అమలు చేయాలని కోరుతూ బుధవారం ఎంపిడిఒ పైడితల్లి, ఎపిఒ మండల గౌరినాథ్‌కు ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘ నాయకులు నల్ల సూర్యనారాయణ, నగిరెడ్డి ఆదినారాయణ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రాంప్రసాద్, యేగిరెడ్డి పోలినాయుడు, మర్రాపు శంకర్రావు, సివ్వాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

11న స్వయం ఉపాధి యూనిట్లు ప్రారంభం

లబ్ధిదారుల ఖాతాలు తక్షణం తెరవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 11న ముఖ్యమంత్రి బిసి స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభిస్తారని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లాలో బిసి కార్పొరేషన్ ద్వారా మంజూరైన యూనిట్ల మేరకు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు తక్షణం తెరవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బిసి యూనిట్ల ఏర్పాటుపై ఎంపిడిఒలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో కనీసం 8 కోట్ల రూపాయల విలువ మేరకు యూనిట్లు ప్రారంభం కావాలని ఆయన ఆదేశించారు. ఎంపిడిఒలు తమ పరిధిలో బ్యాంకులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారుల ఖాతాలను తక్షణం ప్రారంభించాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ అన్ని బ్యాంకులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఖాతాలు తెరవడంలో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల్లో భాగంగా బ్యాంకులు ఉదారంగా బ్యాంకు ఖాతాలు ప్రారంభించి స్వయం ఉపాధి అవకాశాలకు బాట వేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆయా మండలాల వారీగా కేటాయించిన యూనిట్ల వివరాలు వెల్లడించారు. పాచిపెంట మండలానికి 52, గరుగుబిల్లి 87, కొమరాడ 50, సీతానగరం 35, సాలూరు 42, గుమ్మలక్ష్మీపురం 14, కురుపాం 5, భామిని 23, జియ్యమ్మవలస 3, మిగిలిన మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో చర్యలు వేగవంతం చేసి 11వ తేదీ నాటికి సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె హేమలత, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎన్.విజయ స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.





అర్జీలను పరిశీలిస్తున్న పార్వతీపురం, కురుపాం ఎమ్మెల్యే విజయ్‌చంద్ర, జయదీశ్వరి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యతని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

గుమ్మలక్ష్మీపురం : నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గుమ్మలక్ష్మీపురం క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు.

పిహెచ్‌సిలో ప్రసవాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-పార్వతీపుర రూరల్

పిహెచ్‌సిల్లో సురక్షిత ప్రసవాలపై దృష్టిసారించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్ మోహనరావు తెలిపారు. మండలంలో బందలుప్పి, డొకిశీల, పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో నిర్వహించిన పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, వాటి నివేదికలు రికార్డులు, ఎంసిపి కార్డులను పరిశీలించారు. హీమోగ్లోబిన్ శాతం కొంత మంది గర్భిణుల్లో వృద్ధి చెందకపోవడాన్ని గమనించి అందుకు గల కారణాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. హైరిస్క్ గర్భిణులతో మాట్లాడి వారి ఆరోగ్యస్థితి, అందుతున్న వైద్య, అంగన్వాడీ సేవలపై అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పిహెచ్‌సీలో తాగునీటి లభ్యతను పరిశీలించారు. ప్రతినెలా పిహెచ్‌సిలో ఎన్ని సాధారణ కాన్పులు చేపడుతున్నారో రికార్డులో పరిశీలించారు. అనంతరం ల్యాబ్, లేబర్ రూమ్,వార్డు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎన్ఎంకె.తిరుమల ప్రసాద్, ఐశ్వర్య, ధరణి, సూపర్వైజర్లు శ్రీరాములునాయుడు, సత్తిబాబు, శ్రీను, జయలక్ష్మి, ఎస్.జయ, శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

గర్భిణులు, బాలింతలు పోషక పదార్థాలు ఉండే ఆహారం తీసుకోవాలని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి అన్నారు. జాతీయ పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా మండల కేంద్రంతోపాటు నాగూరు, రావివలస గ్రామాల్లో అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సుగుణకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో అందుబాటులో ఉండే సహజ సిద్ధమైన ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా చాలావరకు రక్తహీనతను నివారించవచ్చని చెప్పారు. గరుగుబిల్లి, రావివలస ఐసిడిఎస్ సెక్టార్ల సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, అరుణకుమారి, అంగన్వాడీలు అచ్చియ్యమ్మ, పల్ల కృష్ణవేణి, మహంతి పద్మావతి, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన గర్భిణులకు, బాలింతలకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త పి.సరోజ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అసోసియేట్ సిహెచ్ చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని తలవరం, వండువ గ్రామాల్లో బుధవారం సిడిపిఒ బి.సిమ్మలమ్మ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జె.జ్ఞానమ్మ, ఎస్.రాజేశ్వరి, ఆర్.దశరత్నం, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

అంతర పంటల విధానమే మేలు

ప్రజాశక్తి-పాచిపెంట

ఏకపంట విధానంతో పోలిస్తే అంతర, పలు పంటల విధానం ఎంతో మేలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కేసలి గ్రామంలో రైతులతో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువుల మీదే ఆధారపడి వ్యవసాయం కొనసాగిస్తుండటం వల్ల గత మూడేళ్లతో పోలిస్తే వ్యవసాయ దిగుబడులు తగ్గుతూ, పెట్టుబడులు పెరుగుతున్నాయని రైతులు చెబుతున్నారని అన్నారు. దీనిని నివారించాలంటే పంట మార్పిడి పాటించాలని లేదా పిఎండిఎస్ నవధాన్య విత్తనాలు చల్లిన తర్వాత మాత్రమే ప్రధాన పంటను వేసుకోవాలని సూచించారు. ప్రధాన పంటలో కూడా చిరుధాన్యాలు, కూరగాయలు, అపరాలు వంటివి అంతర పంటలుగా వేసుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. భూమి లోపల బయట జీవావరణ వ్యవస్థ మెరుగుపడి జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. తద్వారా చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. గ్రామంలో పెంట కుప్పలు ఎక్కువగా ఉన్నాయని, ద్రవ జీవామృతం ఉపయోగించి ట్రైప్ టు ఘన జీవామృతాన్ని తయారు చేసుకుని పంట పొలాలకు వినియోగించాలని సూచించారు. దీనిద్వారా అనేక రెట్లు పోషకాలు పంటకు అందడమే కాకుండా భూమిలో సేంద్రీయ పదార్థం పెరుగుతుందని చెప్పారు.అనంతరం రైతు మీసాల మోహన్‌రావు గులి పద్ధతిలో సాగుచేసిన చోడి పంటను పరిశీలించారు. గులి పద్ధతిలో చోడి పంట దిగుబడులు చాలా బాగున్నాయని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అనంతరం ప్రకృతి సేద్య పద్ధతిలో సాగు చేస్తున్న మిరప, టమోటా, వంగ పంటలను పరిశీలించారు. అనంతరం చిరుధాన్యాలు, నవధాన్యాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.